క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగించాలి

ధన్వాడ: బీసీ కుల వృతుల వారికి ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని రజకసంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. సర్వర్లు మొరాయిస్తుండడంతో ఇప్పటికీ చాలా మందికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పొందలేదని తెలిపారు. దరఖాస్తు గడువు మరో రెండు రోజుల్లో ముగియనున్న తరుణంలో సర్టిఫికెట్ల కోసం అర్హులు తహసీల్దార్ కార్యాలయాల వద్దే రాత్రి వరకు వేచిచూస్తున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం దరఖాస్తు చివరి తేదీని ఈ నెల 20 వరకు కాకుండా వచ్చే నెల చివరి వరకు అవకాశం ఇవ్వాలని కోరారు.

రాజకీయ పార్టీల బ్యానర్ల తొలగింపు

మరికల్: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల బ్యానర్లు ప్రమాదాలకు నిలయంగా మారిన విషయాన్ని బీజేపీ నాయకులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన బ్యానర్లను శనివారం సిబ్బందితో తొలగించారు. నెలల తరబడి రోడ్డుపై స్తంభాలకు బ్యానర్లను ఉంచడంతో వాటికి ఏర్పాటు చేసిన కట్టెలు తగిలి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు రాజకీయ పార్టీల బ్యానర్లు కట్టకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానం చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

ఇంటింటి సర్వే



మరికల్: కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన ఓటర్ జాబితాను తయారు చేయడం కోసం శనివారం అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. కొత్త ఓటర్లను బీఎల్ఓలు యాప్‌లో నమోదు చేశారు. మృతి చెందిన వివరాలను సేకరించారు. టీంలుగా వెళ్లి మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారని తహసీల్దార్ రాంకోటి తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మక్తల్: పట్టణానికి చెందిన రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం సభ్యులు రూ.20 వేలు పోగు చేసి బాధితుడికి శనివారం అందజేశారు. రవికుమార్ అవయవాలు పూర్తిగా పని చేయకపోవడంతో మానవతాదృక్పథంతో ఆర్థిక సాయం చేసినట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమలో మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకుడు కావలి శ్రీహరి, పృథ్వీరాజ్, లక్ష్మన్, వాకిటి శ్యామ్, శివకుమార్, అంజయ్యాచారి, చంద్రశేఖర్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

కోస్గి: పట్టణంలోని రామాలయం చౌరస్తా నుంచి మున్నూరువీధి, సయ్యపహాడ్ వరకు రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి డీకే రాములు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పనులు ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా నేటికి పరిహారం అందలేదని తెలిపారు. బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సురేష్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కోస్గి: ఓపెన్ పదో తరగతి ఫలితాల్లో అంధుడు రెడ్డిపల్లి సురేష్‌కుమార్ మొదటి ప్రయత్నంలోనే 6.4 జీపీఏ సాధించి అందరకి ఆదర్శంగా నిలిచాడని సర్పంచ్ హరీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని సర్జఖాన్‌పేట ఉన్నత పాఠశాల ఆవరణలో సురేష్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, సర్పంచ్, గ్రామస్తులు సన్మానించారు. పట్టుదలతో తన వికలత్వాన్ని కూడా జయించాడని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాములు, నర్సిములు, సబితారాం, కవిత తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

నర్వ: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని పెద్దకడ్మూర్‌లో రైతులు ఎడ్లబండ్లపై ఊరేగింపుగా కృష్ణానది జలాలను తీసుకొచ్చి గ్రామంలోని ఆలయాలలో విగ్రహాలను అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కళాశాలలను సందర్శించిన కలెక్టర్

- ఈవీఎంలు భద్రపరిచేందుకు గదుల పరిశీలన



సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కౌంటింగ్ నిమిత్తం అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్‌తో పాటు కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఉదయం వివిధ కళాశాలలను పరిశీలించారు. జిల్లాలోని మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలకు కలిపి ఒకే దగ్గర పంపిణీ చేయడానికి అనువైన ప్రదేశాలను జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల, శ్రీ దత్త బృందావన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. భవనాలను పరిశీలించి ఈవీఎంల భద్రపరచుటకు గదులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ రాంచందర్ నాయక్, ఏఓ నర్సింగ్‌రావు, తహసీల్దార్ దానయ్య, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు తెలంగాణ మంచినీళ్ల పండుగ ఉత్సవాలు..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు 18న తెలంగాణ మంచినీళ్ల పండుగ నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. తెలంగాణ మంచినీళ్ల పండుగ వేడుకల్లో భాగంగా మక్తల్ పరిధిలోని పారవేలులో జరిగే ఉత్సవానికి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి హాజరవుతారని, కొడంగల్ నియోజకవర్గ పరిధిలో మద్దూరు, కోస్గి, గుండుమాల్, కొత్తపల్లిలో ఉన్న 160 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆదివారం ఉదయం ఉదయం 8 గంటలకు నుంచి జిల్లాలోని విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలకు గ్రామాలకు శుద్ధిచేసిన తాగునీటి సరఫరా జరిగే విధానాన్ని వివరించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 3గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేకంగా ప్రజల సందర్శనార్థం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తెరిచి ఉంచుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 8గంటల నుంచి 10.30 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించి గతంలో ఉన్న తాగునీటి కష్టాలు, ప్రస్తుత పరిస్థితి, మెరుగైన తాగునీటి సరఫరా, తీసుకున్న చర్యలు తదితర అంశాలపై చర్చించడం, మిషన్ భగీరథ తాగునీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మహిళలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని మంచినీటి పండుగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం



దీక్ష శిబిరంలో కూర్చున్న జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్షలు శనివారం నాటికి 39వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధన సమితి కో కన్వీనర్లు కెంచె శ్రీనివాస్, రాము మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరువ తీసుకుని కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా రాజకీయ దురుద్దేశంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక నాయకులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే చొరువ తీసుకుని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని కోరారు. మండల ఏర్పాటుతో విద్యారంగం అభివృద్ధి చెంది మరిన్ని పాఠశాలలు, కళాశాలలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో మూడు మండలాలు చేసేందుకు అనుకూలత ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు.

తహసీల్దార్ కార్యాలయం కిటకిట

మద్దూరు: తెలంగాణ ప్రభుత్వం 15 కులాలకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించడంతో ఒక్కసారిగా తహసీల్దార్ కార్యాలయానికి కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తుదారులు బారులుతీరారు. మీ సేవా కేంద్రాలకు క్యూ కట్టారు. ఇప్పటి వరకు మండలంలో దాదాపు 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉండటంతో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదట నిరుద్యోగుల సందడి నెలకొంది. ఒకనొక దశలో కార్యాలయంలో తోపులాట చోటుచేసుకుంది. ఈ విషయమై తహసీల్దార్ చింత రవిని వివరణ కోరగా ఇప్పటి వరకు మండలంలోని లబ్ధిదారులకు దాదాపు 1500 వరకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల అందజేశామని తెలిపారు. 150 వరకు కుల, అదాయ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆదివారం కూడా పనిచేసి దరఖాస్తు చేసుకున్న వారందరికి ధ్రువపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా గిరిజనోత్సవాలు



దుదుగుతండాలో గిరిజన దినోత్సవ వేడుకలు

మద్దూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 14 తండాలోని పంచాయతీల్లో గిరిజనోత్సవాలను ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తండాల్లో ర్యాలీగా వెళ్లి గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జాతీయ జెండాను సర్పంచ్‌లు ఎగురవేశారు. ఈ సందర్భంగా బోగ్ బంగారు కార్యక్రమాన్ని తండావాసులు నిర్వహించారు. సీఎం కేసీఆర్ తండాలను పంచాయతీలుగా చేసి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాడని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కొనియాడారు. పల్లెగడ్డ తండాలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏర్రగుంటతండా, పోర్లకుంటతండా తదితర తండాల్లో ఎంపీఓ ఉదయ్‌శంకర్‌లు పాల్గొన్నారు.



సాపన్‌చెరువుతండాలో జెండా ఎగురవేస్తున్న గిరిజనులు

ధన్వాడ: మండలంలోని తోలగుట్టతండా, దుదుగు తండా గ్రామాల్లో శనివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంపీపీ పద్మినిబాయి పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వం గిరిజనులు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పంచాయతీ కార్యదర్శులు చదవి వినిపించారు. కార్యక్రమలలో సర్పంచులు సువర్ణ, సుగుణ పాల్గొన్నారు.

20న సర్వసభ్య సమావేశం

నర్వ: ఈ నెల 20న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ జయరాములు శెట్టి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



కోస్గి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ అంజలిదేవి శనివారం పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది నవీన్, రత్నమాల, దస్తయ్య, పద్మవతి, జయాఉద్దీన్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకి సన్మానం



మాగనూర్: మండల కేంద్రంలోని పోలిస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కె. మల్లేష్‌ను శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించి శుబాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై ఆత్మకూర్‌కు వెళ్తున్న ఎస్ఐ నరేందర్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, శ్రీనివాసులు, ఈశ్వర్‌యాదవ్, చంద్రశేఖర్, పల్లె మారెప్ప, డీజిల్ సాయిభన్న, సత్యప్ప, రాముగో పాల్‌శెట్టి, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెట్టును తొలగించాలి



పులిమామిడి గ్రామ సమీపంలో రోడ్డుపై కూలిన చెట్టు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్, పులిమామిడి రహదారిపై కూలిన వేపచెట్టును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. నాలుగు రోజుల కిందట ఈదురు గాలులకు చెట్టు కూలి రోడ్డుపై పడిందని వాహనదారులు వాపోయారు. రాత్రివేళ రోడ్డుపై చెట్టు కనపడకపోవడంతో ప్రమాదాలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై పడిన చెట్టును తొలగించాలని కోరారు.

క్రీడా ప్రాంగణంలో రాళ్ల కుప్పలు



పాంరెడ్డిపల్లి క్రీడా ప్రాంగణంలో వేసిన రాళ్లు

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి క్రీడా ప్రాంగణంలో రాళ్ల కుప్పలు ఉండటంతో ఆటలు ఆడుకోవడానికి వీలులేకుండా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి మంజూరైన క్రీడాప్రాంగణం గ్రామ శివారులోని కేజీబీవీ పాఠశాల సమీపంలో నిర్మించారు. పాఠశాల విద్యార్థినులకు ఉపయోగపడుతుందని భావించారు. కానీ వేసవి సెలవుల్లో సమీపంలోని పొలం పనులు చేసుకుంటున్న రైతులు క్రీడాప్రాంగణంలో మిర్చిని ఆరబెట్టుకోవడానికి కవర్లను కప్పారు. కవర్లు ఎగిరి పోకుండా రాళ్లు పెట్టారు. మిర్చిని తీసుకెళ్లిన రైతులు రాళ్లను మాత్రం క్రీడా ప్రాంగణంలో అలాగే వదిలి వెళ్లారు. దీంతో క్రీడా ప్రాంగణం అంతా రాళ్లతో నిండిపోయింది. అధికారులు స్పందించి క్రీడాప్రాంగణాన్ని శుభ్రపర్చాలని విద్యార్థినులు కోరుతున్నారు.

డీవీ కృష్ణన్న వర్ధంతి సభ వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాంథా నాయకులు

నారాయణపేట టౌన్: డీవీ కృష్ణన్న ప్రథమ వర్ధంతి సభలను ఈనెల 22 నుంచి 25 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో ప్రథమ వర్ధంతి సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ డీవీ కృష్ణన్న విప్లవోద్యమం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. 1969లో లేబర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ, రాజీనామా చేసి విప్లవ ఉద్యమంలోకి వచ్చారని, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలో బీడీ కార్మిక నిర్మాణ ఉద్యమానికి ఎంతో కృషి చేశారన్నారు. సిరిసిల్ల రైతాంగ పోరాటానికి మద్దతుగా పోరాడారని గుర్తుచేశారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే డీవీ కృష్ణన్న ప్రథమ వర్ధంతి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, పట్టణ, మండల కార్యదర్శులు కెంచి నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..



మూలమళ్ల, అమరచింత రహదారిలో కాల్వపై వంతెన దుస్థితి

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వపై నిర్మించిన వంతెనల పిట్టగోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదాలు చోటు చేసుకుంటుందోనన్న భయంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వంతెన దాటుతున్నారు. మండలంలోని అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్లే కచ్చా రహదారిపై ఎడమ కాల్వ దాటేందుకు ఇరు గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన పిట్టగోడలు దెబ్బతినడంతో అవి విరిగిపోతున్నాయి. వంతెనపై ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలపై వెళ్తున్న ప్రజలు వీటిని గమనించకుండా వెళితే కాల్వలో పడిపోవడం ఖాయమంటున్నారు. ఇప్పటికైనా పీజేపీ అధికారులు స్పందించి వంతెనల మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



హిందుపూర్ గ్రామ ఊర చెరువులో మట్టిని తీసిన ఆనవాళ్లు

కృష్ణా: మండలంలోని హిందుపూర్ చెరువు నుంచి కొంతకాలంగా ఎలాంటి అనుమతులు ఒండ్రు మట్టిని స్థానికంగా ఉండే మహారాష్ట్రకు చెందిన ఇటుకల బట్టీల యజమానులు అక్రమంగా తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో వారిని అడ్డుకునే వారేలేరు. దీంతో రాత్రి పగలు మట్టిని ఇస్టానుసారంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వందల టిప్పర్ల మట్టిని తరలించుకపోతున్నా వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ అడగగా చెరువు మట్టిని తరలించేందుకు ఎవరికి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకుంటాం.

విద్యార్థికి అభినందన

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన విద్యార్థి సుప్రియ నీట్ ఫలితాల్లో 509/720 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా శనివారం సర్పంచ్ మహాదేవమ్మ, ఎంపీటీసీ వెంకటేష్, నారాయణలు విద్యార్థినిని అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానంలో స్థిరపడి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సామాజిక సేవల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

అమరచింత: సామాజిక సేవల్లో యువకులు పాల్గొని ప్రజలకు సేవ చేయాల్సిన అవసరం ఉందని రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా అన్నారు. మండల కేంద్రంలో దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో విలేకరులతో కలిసి ప్రజలకు తాగునీటిని అందిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న ప్రెస్ క్లబ్ సభ్యులు చలివేంద్రంలో పాల్గొని ప్రజలకు సేవలు అందించడం అభినందనీయం అన్నారు. పట్టణంలో వేసవి ప్రారంభం నుంచి యూనియన్ బ్యాంక్ సమీపంలో దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, ఖాజా పాల్గొన్నారు.

పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి



పులిమామిడిలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

ఊట్కూరు: పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు శివాజి డిమాండ్ చేశారు. మండలంలోని పులిమామిడిలో మార్కండేయస్వామి దేవాలయంలో శనివారం పద్మశాలీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పులిమామిడి, ఊట్కూరు, చిన్నపొర్ల, పెద్దపొర్ల, పగిడిమారి తదితర గ్రామాలలో పద్మశాలీలు చేనేత కులవృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగించేవారన్నారు. పవర్ లూమ్స్ రావడంతో గ్రామాలలో మగ్గాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు ఉపాధి లేక ముంబాయ్, చోలాపూర్, హైదరాబాద్ తదితర పట్టణాలకు వలసలు వెళ్లారన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారని పేర్కొన్నారు. చేనేత బీమా పథకాన్ని పద్మశాలీలందరికి వర్తింపజేయాలని కోరారు. ప్రత్యేక రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజారమేష్, ఏర్పుల మనోహర్, బోగం లక్ష్మీనారాయణ, కొంకటి తిరుపతి, శోభన్‌బాబు, రఘు, వాసు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోండి

నర్వ: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను మండలంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 నుంచి 35 ఏళ్ల యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, మహేష్, వివేకవర్ధన్‌రెడ్డి, కోట్ల శ్రీనువాసులు రవి సాగర్, రామన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శశ్మాన వాటికలో వసతులు కరువు

- ప్రధాన డ్రైయినేజీ సమీపంలోనే నిర్మాణం
- వరద నీటిలో ఖననం చేసేందుకు ఇబ్బంది
- మురుగు చేరకుండా ప్రహారీ నిర్మించాలి



శశ్మాన వాటిక పక్కనే ప్రవహిస్తున్న డ్రైయినేజీ

నారాయణపేట టౌన్: మనిషి జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని చివరకు చనిపోయిన తర్వాత మృతదేహాన్ని ఖననం చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో ఎస్సీ కాలనీలో 450 పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారికి సంబంధించిన శ్మశానవాటిక యాద్గీర్ రోడ్‌లో ఉన్న ప్రధాన డ్రైయినేజీ పక్కనే ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా భారీ వర్షాలకు కొండారెడ్డిపల్లి చెరువు చెరువు అలుగు నీరు ఈ కాల్వ గుండానే పారడంతో పాటు వివిధ కాలనీల నుంచి వచ్చే మురుగు ఇదే ప్రధాన కల్వర్టులోకి వచ్చి కలుస్తుంది. దీంతో ఎస్సీ, హరిజన కాలనీకి చెందిన ఎవరైనా వర్షాకాలంలో చనిపోతే ఖననం చేసేందుకు కష్టంగా ఉంటుందని వాపోతున్నారు.

స్థలం కొరత..

యాద్గీర్ రోడ్‌లోని ప్రధాన కల్వర్టులోనే శ్మశానవాటిక ఉండటంతో భారీ వర్షాలకు సమాధులు సైతం మునిగిపోతున్నాయి. మరికొందరు తమ వాళ్ల సమాధులపై ఘోరీలు నిర్మాణం చేయడంతో స్థలం కొరత ఏర్పడింది. రాబోయే వర్షాకాలంలో వరద ఉధృతి ఎక్కువైన సమయంలో ఎవరైనా మరణిస్తే మురుగు నీటిలోనే గుంతలు తవ్వి ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం శ్మశాన వాటికలోకి మురుగు చేరకుండా ప్రహారీ నిర్మాణం చేసి కనీస వసతులు కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

పట్టించుకునే వారు లేరు..



ఎస్సీ కాలనీ, హరిజనవాడలో శ్మశానం ఉన్న ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందుల మధ్య ఖననం చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా తమకు మరో స్థలం కేటాయించట్లేదు. దాదాపు నలభై ఏళ్ల నుంచి ఇదే ప్రధాన డ్రెయినేజీ మురుగు నీటి ప్రవాహంలో శవాలను ఖననం చేస్తున్నాం. నీటి ప్రవాహం వల్ల స్థలం కూడా సరిపోవడం లేదు. మరోచోట శ్మశాన వాటికను కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చంద్రప్ప, ఎస్సీవాడ, నారాయణపేట

రక్షణ గోడ నిర్మిస్తే మేలు..

మురుగు నీరు సమాధులపై నుంచి పారకుండా రక్షణ గోడ నిర్మిస్తే కొంత వరకు మేలు జరుగుతుంది. ఖననం చేసేందుకు కూడా వీలు ఏర్పడుతుంది. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలి.

– తిరుపతమ్మ, హరిజనవాడ, నారాయణపేట

సమస్యను పరిష్కరిస్తాం

దామరగిద్ద రోడ్‌లో హరిచంద్ర ముక్తిధామ్‌లో ఖననం చేసుకోవాలని ఇది వరకే వారికి సూచించాం. వారికి ఆర్థికంగా భారం కాకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వైకుంఠ రథం అందుబాటులో ఉంచాం. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే త్వరలోనే పరిష్కరిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట